క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: ఆర్ఎస్ ఇండియా ఫౌండేషన్ నూతనంగా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను చినరావూరులోని ఆర్ఎస్ చర్చిలో ఆదివారం రెవరెండ్ పల్లె శామ్యూల్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌లో ప్రతిరోజు బైబిల్‌కు సంబంధించిన వాక్యాలను పొందుపరచటం జరిగిందన్నారు. సంఘ సభ్యులు ఝాన్సీ రాణి, శివకుమారి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి జీవనశైలిని కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: మంచి జీవనశైలిని కలిగి ఉండటం వల్ల వ్యాధులు దరిచేరవని హ్యాపీ మల్టీ స్పెషాలిటీ హస్పటల్ నిర్వాహకులు డాక్టర్ పావని ప్రియాంక పేర్కొన్నారు. హ్యాపీ హస్పటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ మహేష్ కిరణ్, డాక్టర్ ఈదర సుప్రియ చౌదరి, డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ మంజులవాణిలు రోగులకు వైద్య సేవలు అందించారు. అలాగే బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. ఉదయ్, భాస్కర్, రమణమ్మ, సతీష్, పూజిత, సంధ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

5న హైందవ శంఖారావం సభ



తెనాలి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సభకు ప్రజలను సన్నద్ధులను చేసేందుకు ఆదివారం రూరల్ మండల గ్రామం నందివెలుగులో సమావేశం నిర్వహించారు. తెనాలి సరస్వతి శిశుమందిర్ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు, న్యాయవాద పరిషత్ సభ్యుడు పోతూరి నాగేంద్రం సమీక్షించారు. స్థానిక బీజేపీ నాయకుడు టి.కోటేశ్వరరావు, జనసేన నేత శేషగిరి, టీడీపీ నాయకుడు బొప్పన శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 11వ తేదీన గీతాజయంతి ఉత్సవాలను 'శౌర్యదివస్'గా ఘనంగా నిర్వహించాలని సూచించారు.

శతకవుల సమ్మేళనంలో 'ఆళ్ల'కు సత్కారం



తెనాలి: అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన తెలుగు పొయెట్రీ ఫెస్టివల్‌లో శతకవుల సమ్మేళనం నిర్వహించారు. ఇందులో వచన కవితా పఠనం చేసిన తెనాలికి చెందిన ప్రముఖ కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావును సత్కరించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కళారత్న డాక్టర్ పొట్లూరి హరికృష్ణ, ప్రముఖ సంఘ సేవకుడు గోళ్ల నారాయణ, సాహితీవేత్త ఎస్‌డీ సుభాని, బీవీవీ సత్యనారాయణ, అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మిలను జ్ఞాపిక, శాలువ, ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

వైకుంఠపురంలో సామూహిక సత్యదేవ వ్రతాలు



తెనాలి: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో రమాసహిత సత్యదేవ వ్రతమహోత్సవాలు ఆఖరి ఆదివారంతో ముగిశాయి. ఆదివారం మొత్తం 81 మంది దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారు. కార్తిక మాసంలో ఐదు ఆదివారాల్లో కలిపి మొత్తం 601 మంది దంపతులు వ్రతమహోత్సవాల్లో పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ తెలియజేశారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు నేతృత్వంలో ఆలయ అర్చకులు భక్తులతో వ్రతాలను శాస్త్రోక్తంగా జరిపించారు. బోర్డు సభ్యులు కురగంటి సునీత రవిశంకర్, దేవరకొండ వెంకట రమణ శంకరరావు, మావులూరి శ్రీనివాస్, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

అడుగు దూరంలోనే ఆహ్లాదం!

- పర్యాటకానికి అనుకూలంగా నిజాంపట్నం కాల్వ
- దుగ్గిరాల – తెనాలి మధ్య అందమైన పార్కు.. బోటు షికారుకూ అవకాశం
- పట్టించుకోని పాలకులు



దుగ్గిరాల వద్ద కృష్ణాపశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ



దుగ్గిరాల వద్ద ఆరంభమయ్యే నిజాంపట్నం కాల్వ

తెనాలి: చిలక పచ్చ చీరె కట్టుకున్నట్టు వయ్యారాలు పోయే వరి పైరు, నడుమ వడ్డాణంలా పంటకాల్వలూ...పగలంతా పొలం పనుల్లో పనిచేసే ఇంటికి చేరుతుండే రైతులు, రైతుకూలీలు...ఇలాంటి దృశ్యాలు మనసుకు ఆహ్లాదం కలిగిస్తాయి...ఇక మరింత ఆహ్లాదకరమైన పార్కులో కూర్చుని పరిసరాలను ఆస్వాదిస్తుంటే, ఆ పంటకాల్వలోనే హుషారుగా బోటుషికారు చేస్తుంటే...మనసుకెంత ఊరట కలుగుతుంది... ఎంత ఆటవిడుపుగా ఉంటుంది... అందుకు అనువైన ప్రదేశం మనదగ్గరే ఉంది. చిత్తశుద్ధితో ప్రభుత్వం ముందుకొస్తే, ఆచరణలో పెట్టే అధికారులు నడుంబిగిస్తే ఆంధ్యాప్యారిస్ సిగలో అద్భుతమైన ఆటవిడుపు కేంద్రం రూపుకడుతుంది.

నిజాంపట్నం కాల్వ ఎంతో అనుకూలం..

పాలకులకు తగిన సంకల్పం, అవసరమైన చిత్తశుద్ధి ఉన్నట్టయితే తగిన పర్యాటక అవకాశాలకు డెల్టాలో కొదవలేదు. ముఖ్యంగా కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలో. ఇక్కడ ఆభరణాల్లా భాసిల్లుతుండే పంటకాల్వల్లో తగినవాటిని ఎంచుకొని, అభివృద్ధి చేయగలిగితే అటు పర్యావరణం, ఇటు ప్రజలకు ఆహ్లాదాన్ని అందుబాటులోకి తీసుకురావొచ్చు. వీటిలో దుగ్గిరాల లాకుల నుంచి తెనాలి మీదుగా వెళ్లే నిజాంపట్నం కాల్వ ఎంతగానో అనుకూలంగా ఉంటుంది. రూపురేఖలు చెరిగిపోతోన్న ఈ కాల్వకు పూర్వవైభవం కల్పించినట్టవుతుంది.

ఆక్రమణలు, అపరిశుభ్రతకు నిలయంగా..

ప్రకాశం బ్యారేజీ సమీపంలో సీతానగరం వద్ద చీలే కృష్ణాపశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ, దుగ్గిరాల వద్ద శాఖోపశాఖలుగా చీలుతుంది. ఆయా పంటకాల్వలు, మూడు జిల్లాల పరిధిలోని 5.71 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తుంటాయి. వందలాది చెరువులను నింపి ఆయా గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని సమకూర్చుతున్నాయి. ఈ కాల్వల పొడవునా ఆక్రమణలకు గురవుతున్నాయి. పట్టణాలు, గ్రామాల్లోంచి వెళ్లే చోట్ల మురుగునీటిని, ఫ్యాక్టరీల్లోంచి వచ్చే వ్యర్థాలను కాల్వల్లోకి మళ్లిస్తున్నారు. ఇప్పటికీ కొందరు బహిర్భూమిగానూ వినియోగిస్తున్నారు. సాగునీటినీ, తాగునీటినీ అందించే పంటకాల్వలను పరిశుభ్రంగా ఉంచాలన్న అవగాహన, స్పృహ అటు పాలకులు, ఇటు ప్రజల్లోనూ కొరవడింది. అందుకోసమే అనువైన పంటకాల్వల వెంబడి కట్టలను అభివృద్ధి చేయగలిగితే కాలుష్య సమస్య తీరుతుంది. పరిసరాలు బాగుంటాయి. ప్రజల ఆటవిడుపునకు కేంద్రాలు అవుతాయి. ఒకప్పుడు జలరవాణాలో వర్ధిల్లిన నిజాంపట్నం కాల్వ ఇందుకు ఎంతగానో అనువైంది.

11 కి.మీ దూరం బోటింగ్‌కు అనుకూలం...

దుగ్గిరాల నుంచి నిజాంపట్నం కాల్వ ఎడమకట్ట విశాలంగా ఉంటుంది. తెనాలి వరకు కాల్వకట్టను కెనాల్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయాలి. విద్యుద్దీకరణ చేసి, పచ్చని లాన్‌లు, సిమెంటు బల్లలు ఏర్పాటుచేయాలి. కాల్వలో బోటు షికారుకు అవకాశం కల్పించి, బోటు ఎక్కి దిగేందుకు వీలుగా అక్కడక్కడా చిన్న చిన్న రేవులు నిర్మించి, కాల్వకు ఒకవైపు సిమెంటు లైనింగ్ చేయగలిగితే దుగ్గిరాల – తెనాలి మధ్య దాదాపు 11 కిలోమీటర్ల దూరం కాల్వ ఒడ్డున అందమైన పార్కును తీర్చిదిద్దినట్టు అవుతుంది. బోటు షికారుకు సెలవురోజుల్లో రద్దీ ఏర్పడుతుంది. నిర్వహణ వ్యయం కోసం స్వల్పంగా చార్జీలను నిర్ణయించినా ప్రజలు వెనుకాడరు. ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి, నిధులు సమకూర్చి ఈ కాల్వను తీర్చిదిద్దగలిగితే తెనాలికి ఆంధ్రా ఆమ్‌స్టర్‌డామ్ అనే మరోపేరు కూడా సార్థకమవుతుంది. తెనాలి నుంచి విజయవాడ వెళ్లే రోడ్డులో దుగ్గిరాల వరకు నిజాంపట్నం కాల్వ కట్ట సువిశాలంగా ఉంటుందని తెలిసిందే. గతంలో విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి పట్టణాభివృద్ధి (వీజీటీఎం) సంస్థ చైర్‌పర్సన్‌గా డాక్టర్ కొల్లి శారద బాధ్యతల్లో ఉన్నపుడు ఈ కాల్వ కట్టపై మొక్కలు నాటించారు. అవి ఏపుగా పెరిగి రహదారిని హరితవనంలా కాపు కాస్తున్నాయి. ఇంతకుమించి కాల్వలనూ ఉపయోగించుకునే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యంగా వదిలేయటం వల్ల కాల్వ రూపురేఖలను కోల్పోతోంది. కట్టలు కోసుకుపోతున్నాయి.

బాలికతో మేనమామ అసభ్య ప్రవర్తన

పోక్సో కేసు నమోదు

తెనాలిరూరల్: బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న మేనమామపై పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పనులు చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొన్ని కుటుంబాలు తెనాలి మండలం కొలకలూరులోని ఓవర్‌బ్రిడ్జి కింద నివసిస్తున్నాయి. వీరిలో తొమ్మిదేళ్ల బాలికతో 35 ఏళ్ల మేనమామ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు తెనాలి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

దోమతెరల పంపిణీ



దోమతెరను అందజేస్తున్న దిలీప్‌రాజా

తెనాలి: రోడ్డువెంట నివసిస్తున్న సంచార జాతుల కుటుంబాలకు ఆదివారం సినీ దర్శకుడు దిలీప్‌రాజా దోమతెరలను పంపిణీ చేశారు. స్థానిక మార్కెట్ వంతెన దగ్గర రోడ్ల మీద చలికాలంలో నిద్రపోతున్న ఆయా నిరుపేద కుటుంబాలు, రాత్రిళ్లు కనీసం కంటి నిండా నిద్ర పోగలరన్న భావనతో ఈ సేవాకార్యక్రమం చేసినట్టు తెలిపారు. రూరల్ మండల గ్రామాలైన పెదరావూరు, కొలకలూరు కాల్వ కట్టలపై జీవిస్తున్న గిరిజనులకు బియ్యం పంపిణీ చేశారు. మునిపల్లి శ్రీకాంత్, రత్నాకర్, నరేష్, దోనే భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా 'రెడ్డి' కార్తిక వనసమారాధన



శ్రీయోగి వేమారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

తెనాలి: రూరల్ మండల గ్రామం సంగం జాగర్లమూడిలోని శ్రీసంగమేశ్వర దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధనను ఘనంగా నిర్వహించారు. సభలో ట్రస్ట్ అధ్యక్షుడు కిక్కూరి చిన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పాలనను అందించిన రెడ్డి రాజుల అడుగుజాడల్లోనే తర్వాతి తరాలు నడుస్తున్నాయని చెబుతూ నేటి యువత యోగి వేమారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ట్రస్ట్ కార్యదర్శి సీహెచ్‌బీ విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ మనదైన సంస్కృతి, సంప్రదాయాలను నేటి యువతకు అలవరచాలనీ, ఆర్థికంగా నష్టపోయిన రెడ్డి వర్గీయులకు ప్రభుత్వ పథకాలు అందేలా, విద్య, రాజకీయ రంగాల్లో తెనాలి డివిజన్‌లో ముందుడుగు వేసేలా కృషిచేయాలని సూచించారు. బొంతు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రెడ్డి వర్గీయులంతా ఏకతాటిపై నడవాలని సూచించారు. సభలో తెనాలి కౌన్సిలరు కిక్కూరి మానసారెడ్డి, డాక్టర్ భవనం నందినిరెడ్డిని సత్కరించారు. కేసరి కృష్ణారెడ్డి, ఢాకా సాంబిరెడ్డి, కిక్కూరి వెంకట సత్యనారాయణరెడ్డి, తిరుమల లక్ష్మారెడ్డి, రామిరెడ్డి, బొంతు నాగిరెడ్డి, కిక్కూరి హైమావతి, సీహెచ్ పావని, శివశంకరరెడ్డి, మహేష్‌రెడ్డి, భవనం అనూరాధ, తిరుమలరెడ్డి, శేఖరరెడ్డి, పవన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, కిక్కూరి సతీష్‌రెడ్డి, సాంబిరెడ్డి, అతిథిగా వెంకటరెడ్డి హాజరయ్యారు. వందలాదిగా పాల్గొన్న వనసమారాధనలో కోలాటం, భజనలు, శాస్త్రీయ నృత్యాంశాలతో కోలాహలంగా సాగాయి.

కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో...

తెనాలిఅర్బన్: అందరు ఐకమత్యంతో జీవిస్తు పలువురికి ఆదర్శంగా నిలవాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో కార్తిక వన సమారాధనను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కోలా అశోక్ కుమార్, కౌన్సిలర్ అన్నం పిన్నారావు, టీడీపీ నాయకులు తాడిబోయిన శ్రీనివాసరావు, మహ్మద్ కుద్దూస్, కావేటి వేణుగోపాలరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణబలిజ సంఘం వన సమారాధనలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి

అంకమ్మతల్లి ఆలయంలో...

తెనాలి: పవిత్ర కార్తికమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా పట్టణంలోని 25వ వార్డులో గల అంకమ్మతల్లి దేవస్థానంలో వన సమారాధనను ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వహకుడు కొల్లిమర్ల పోతురాజు, గుంటూరు శ్రీనివాసరావు, తాడిపోయిన నాగేశ్వరరావు, తాడిపోయిన బోసు, తాడిపోయిన యజ్ఞ నారాయణ, మైలా వెంకటేశ్వర్లు, కొల్లిమర్ల శ్రీహరి, అక్కి శివశంకరరావు, స్థానికులు పాల్గొన్నారు.

డాక్టర్ హరిప్రసాదరావుకు ఘననివాళి



డాక్టర్ హరిప్రసాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు, కుటుంబ సభ్యులు

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు 100వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులతో పాటు ఆయన కుమారుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్, కోడలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, పలువురు వైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్య వృత్తిలో ఆయన అందించిన సేవలను వారు స్మరించుకున్నారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. మధు ప్రభాకర్‌బాబు, ఉపాధ్యక్షురాలు డాక్టర్ పావని ప్రియాంక, కోశాధికారి డాక్టర్ కొత్తమాసు శ్యామ్ ప్రసాద్, డాక్టర్ జి.నరసింహారావు, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ రాజేశ్వరప్రసాద్, డాక్టర్ గిరిజ, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అప్రమత్తత అవసరం



హెచ్ఐవీ లోగో వద్ద జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ, అధ్యాపకులు

తెనాలిఅర్బన్: హెచ్ఐవీపై ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం సుల్తానాబాద్‌లో ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే హెచ్ఐవీ బారిన పడే వారి సంఖ్య చాలా తగ్గిందన్నారు. హెచ్ఐవీ సోకిన వారు మందులు సక్రమంగా వాడుకుంటే జీవన ప్రమాణం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. హెచ్ఐవీని పూర్తిగా నియంత్రించేందుకు ప్రజలందరు సహకరించాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ అరుణ సుజాత, అధ్యాపకులు డాక్టర్ శారదమేరి, డాక్టర్ అమూల్ మేరి, డాక్టర్ నిర్మలజ్యోతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లావ్యాప్తంగా చెట్లు నాటుతాం

బుర్రిపాలెంలో మొక్కలు నాటిన కేంద్ర మంత్రి పెమ్మసాని



మొక్కలు నాటుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, మాజీ మంత్రి ఆలపాటి

తెనాలిరూరల్: తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం పర్యటించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి గ్రామంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'పచ్చదనం-ప్రాణహితం' కార్యక్రమం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుర్రిపాలెం గ్రామం నుంచి మంత్రి పెమ్మసాని ప్రారంభించారు. గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం అనంతరం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వృద్ధులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా అందమైన చెట్లు ఉండేలా మొక్కలు నాటుతున్నామని, గుంటూరు జిల్లావ్యాప్తంగా చెట్లు నాటే కార్యక్రమంలో భాగంగా బుర్రిపాలెం నుంచి తొలి అడుగు వేస్తున్నామని చెప్పారు. తొలి దశలో భాగంగా 300 చెట్లను నాటుతున్నామన్నారు. సీసీఎల్ ప్రాజెక్ట్స్ తరపున కాంటినెంటల్ కాఫీ ఎండీ రాజేంద్రప్రసాద్ ఈ కార్యక్రమానికి సహకరిస్తూ ఏడాదికి రూ. 50 లక్షల చొప్పున ఐదేళ్లలో రూ. 2.50 కోట్లను అందించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకుంటామని చెప్పారు.

ఆంజనేయ స్వామికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న దక్షిణాముఖ ఆంజనేయస్వామికి ఆదివారం విశేష అర్చనలు నిర్వహించారు. ఉదయాన్నే పంచామృతాలతో స్వామికి అభిషేకాలు చేసి మన్యుసూక్తం పారాయణకావించారు. లక్ష తమలపాకులతో(నాగవల్లీ)అర్చనలు చేశారు. అర్చకులు నారాయణం ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు సహస్త్రనామాలతో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహిళలకు వంటల పోటీలు



వంటలు పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

తెనాలి: ఇంధన సంస్థల నిర్ణయం ప్రకారం పట్టణానికి చెందిన తెనాలి గ్యాస్ కంపెనీ, శ్రీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో నోడల్ అధికారి జె.జగదీష్ పర్యవేక్షణలో ఆదివారం మహిళలకు వంటల పోటీలు జరిపారు. స్థానిక గాంధీచౌక్‌లోని హోటల్ ప్రిన్స్‌లో 'మన వంటగది – మన బాధ్యత' పేరుతో జరిగిన పోటీలకు డాక్టర్ డి.జీవనలత, వాసిరెడ్డి ప్రియబాంధవి, కొడాలి సౌజన్య న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఎల్.నగరాజకుమారి (ప్రథమ), ఎ.ఉషారాణి(ద్వితీయ), వి.శ్యామల (తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు బహుమతులను అందజేశారు. ఎస్.విజయలక్ష్మి, వి.అనూరాధ, పి.అమూల్యకు ప్రోత్సాహక బహుమతిగా రూ.వెయ్యి చొప్పున నగదును అందించారు. తెనాలి గ్యాస్ కంపెనీకి చెందిన వీవీ రమణ, శ్రీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీకి చెందిన వి.మురళీకృష్ణ పర్యవేక్షించారు. పోటీలకు ముందు వంటగ్యాస్ ఆదా, గ్యాస్ సిలెండర్ వాడకంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



బుర్రిపాలెం రోడ్డులో ధాన్యం తిరగేస్తున్న రైతులు

కాపాడుకునేందుకు ప్రాధాన్యం

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు ప్రయాసపడుతున్నారు. తుఫాన్ కారణంగా వాతావరణం మారిపోవటం, వర్షం నుంచి నూర్పిడి చేసి, రోడ్ల వెంట ఆరబెట్టిన ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ పట్టలను కప్పారు. గత రెండు రోజులుగా జల్లులు కురిసినపుడు కప్పుతూ, సాధారణ సమయంలో తొలగిస్తూ ధాన్యాన్ని తిరగేస్తూ.. ఆరబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. వర్షం ముప్పు తొలగిందని ఊరట చెందేలోపు మళ్లీ ఆదివారం సాయంత్రం వర్షం కురవటంతో రైతులు ధాన్యం కుప్పలపై పట్టలు కప్పుతూ హడావుడి పడాల్సివచ్చింది.

– తెనాలి

ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్ వుల్లక్కి జయంతి



డాక్టర్ వుల్లక్కి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు

తెనాలి రూరల్: తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మేజర్ కాకుమాను వుళ్ళక్కి జయంతిని తెనాలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఎంఐ కార్యాలయానికి ఆయన పేరు పెట్టడం గురించి వైద్యులు వివరించారు. తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ జె.విజయలక్ష్మి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ పాలడుగు ఉమామహేశ్వరరావు, డాక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.